ఆలయాల్లో శ్రావణ శోభ!

- వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు
- విశేష అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- దేవాలయాల్లో భక్తుల సందడి



వెల్లటూరులో గాజులతో విశేషంగా అలంకరించిన అమ్మవార్లు

భట్టిప్రోలు: శ్రావణమాసం.. అందులోనూ శుక్రవారం కావడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను విశేషంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణమాసంలో సామూహికంగా నిర్వహించే పూజల వల్ల సత్ఫలితాలు పొందుతారని.. అమ్మవారికి కుంకుమార్చన చేయడంతో మహిళలు సౌభాగ్యవంతులు అవుతారని వేద బ్రాహ్మణులు పేర్కొన్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామదేవతలు శ్రీదండిపార్వతి, ఆదెమ్మ తల్లి, భట్టిప్రోలు శ్మశానవాటికలో కొలువైన గుండిపార్వతి అమ్మవార్లకు అర్చకులు వైభవంగా పూజలు నిర్వహించారు. వెల్లటూరు గ్రామదేవత కట్టమ్మ తల్లి దేవాలయాల్లో అమ్మవార్లు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మ, భూనీళా సమేత వరదరాజస్వామి దేవాలయంలో పేరిందేవి, రాజరాజ నరేంద్ర స్వామి దేవాలయంలో బాలత్రిపుర సుందరి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లకు సామూహికంగా పూజలు నిర్వహించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

రేపల్లె: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో కొలువైన గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధార్ గురుకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ముత్యాల చీర, రజత ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రావణమాసం శుభప్రదం..

భట్టిప్రోలు: శ్రావణమాసం హిందువులకు శుభప్రదమైన మాసం అని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. భట్టిప్రోలులో నిర్వహించిన దేవాలయాల అర్చకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ ద్వారా నిర్మాణమైన దేవాలయాలు జిల్లాలో ఎక్కువగా నిర్మించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ.. లక్ష్మీ అమ్మవారు ఐశ్వర్య ప్రదాయినిగా ధర్మ రక్షా బంధనం జరుపుకొంటూ హిందూ ధర్మ రక్షణకు పాటు పడాలని అన్నారు. 5వ తేదీ వరకు మండల సమావేశాలు, 9న రెండో శనివారం సత్సంగం, పౌర్ణమి సామూహిక హారతులు, 5, 19వ తేదీలలో ఏకాదశ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ధర్మ రక్షా బంధన్ కార్యక్రమాలు ధార్మిక సమితి ఆధారంగా నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



భట్టిప్రోలు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని వామపక్షాల ప్రజా సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భట్టిప్రోలు ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంతగా జరగనున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యన్నారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐవైఎఫ్, వివిధ సంఘాల నాయకులు నాగరాజు, పి.మనోజ్, బందారు శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.వీరమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కర్లపాలెం: కంటి వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని రేపల్లె ఫోకస్ కంటి హాస్పటల్ నేత్ర వైద్యులు కిషోర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, రెడ్డి సేవా మిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తనందాయపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యుడు కిషోర్ పాల్గొని 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ.. కళ్ల అద్దాలు అవసరమైన వారికి ట్రస్ట్ తరపున అందజేస్తున్నామని తెలిపారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారికి రేపల్లెలోని ఫోకస్ హాస్పటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్‌లు రావి రాంబాబురెడ్డి, దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు శవనం శంకర్‌రెడ్డి, రావి అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో అభివృద్ధి



బాపట్ల అర్బన్: భాజపా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో అన్ని విధాలా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో జరుగుతున్న సారథ్యం కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. యువ నాయకుడు పీవీఎన్ మాధవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. సారథ్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 6వ తేదీన రాష్ట్ర అధ్యక్షుడు బాపట్లకు రానున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బంగారు బాబు, ఇస్క సునీల్, యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కొట్ర రామకృష్ణ, జగన్నాథ శాస్త్రి, కాట్రగడ్డ శ్రీనివాసరావు మణి యాదవ్, కొండారెడ్డి అనిల్, బాబు నాగేంద్ర, తిలక్, బి.కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు సీఐను వెంటనే సస్పెండ్ చేయాలి



బాపట్ల టౌన్: దళితులపై దాడులకు పాల్పడుతూ.. వాళ్ల మనోభావాలు దెబ్బతీస్తున్న ఇంకొల్లు సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని దళిత సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ జి.చార్వాక తెలిపారు. పట్టణంలోని గౌతమి గ్రాండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దగ్గుబాడు పంచాయతీ ఆఫీసులో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని తొలగించలేదనే అక్కసుతో ఇంకోలు సీఐ గ్రామ సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈనెల 4న ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, భీమ్ ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు కొచ్చర్ల వినయ్ రాజు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు, గేరా స్వరాజ్, కూరాకుల ఇస్సాకు, దగ్గుబాటి సర్పంచి రవీంద్రనాథ్ ఠాగూర్, తుళ్లూరు యోహాను, గుడిపాటి మోజెస్, కొమ్మునాని, పద్మ చైతన్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు



కప్పలవారిపాలెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

ఖాజీపాలెం(కర్లపాలెం): ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని బాపట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం సమన్వయ కర్త కోన రఘుపతి తెలిపారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు, ఖాజీపాలెం పంచాయతీ కప్పలవారిపాలెంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజలకు ఇంకా ఏలాంటి మేలు చేయగలమని ఆలోచించేవారని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎలా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తాడని కోన రఘుపతి ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను చంద్రబాబు మోసం చేశారని కోన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం అనూష, ప్రసన్నరాజు, ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ కృపానందం, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఏట్ర అశ్వనీరెడ్డి, వైఎస్సార్ సీపీ ఖాజీపాలెం గ్రామ అధ్యక్షుడు దేవేంద్రరాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు షేక్ మౌలాలీ, నాయకులు మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాష్, దొంతిరెడ్డి కోటిరెడ్డి, వాలి శివారెడ్డి, బడుగు మాధవి, రామచంద్రరాజు, గుమ్మడి సీతయ్య, సత్యనారాయణరెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ డ్రెయిన్‌పై అక్విడెక్ట్ ప్రారంభం

వెల్లటూరు చానల్ వద్ద సాగునీటి విడుదల



ప్రారంభోత్సవంలో మంత్రి సత్యప్రసాద్, పక్కన ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకట మురళీ

భట్టిప్రోలు: వెల్లటూరు చానల్ భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై రూ.10.75 కోట్లతో నిర్మించిన నూతన అక్విడెక్ట్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. వెల్లటూరు చానల్ నుంచి నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం పరిధిలో వేమూరు, రేపల్లె ప్రాంతాలకు సంబంధించిన సాగునీటి విడుదల అందుతుందని తెలిపారు. భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై పురాతన కాలం నాటి అక్విడెక్ట్ కూలిపోవడంతో నిర్మాణం శర వేగంగా పూర్తిచేయడం హర్షణీయమన్నారు. అంతకు ముందు వెల్లటూరు చానల్‌కు సాగునీటి విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మేకా శ్రీనివాసరాలు, ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, చీఫ్ ఇంజినీర్ బి.రాంబాబు, ఎస్ఈ పి.వెంకటరత్నం, డివిజన్ ఏఈ ఎస్.సుధాకర్, డిప్యూటీ ఏఈ ఎం.అనీల్ కుమార్, డీఈఈ దీన దయాళ్, ఏఈ నీలం సువర్చల, ఐసీ అసిస్టెంట్ వక్కపట్ల వెంకటేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు వాకా శేషు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో సంఘ అధ్యక్షులుగా కాళీకృష్ణ

భట్టిప్రోలు: మండల గ్రామ రెవిన్యూ అధికారుల సంఘ అధ్యక్షులుగా భట్టిప్రోలు వీఆర్వోగా పని చేస్తున్న పెనుమూడి కాళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సంఘ గౌరవాధ్యక్షులుగా సీహెచ్ పులయ్య, కార్యదర్శిగా సీహెచ్ రవి, మహిళా కార్యదర్శిగా ఎన్.లక్ష్మీ, కోశాధికారిగా ఎల్.సురేష్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను పలువురు వీఆర్వోలు, మండల రెవిన్యూ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పదవీ విరమణ సత్కారం

కర్లపాలెం: రెవెన్యూ శాఖలో సబార్డినేటర్‌గా ఇప్పటి వరకూ ఆట్ల సాంబశివారెడ్డి అందించిన సేవలు ఆదర్శవంతమైనవని తహసీల్దార్ షాకీర్ పాషా తెలిపారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేసిన ఆట్ల సాంబశివారెడ్డి జూలై 31వ తేదీన పదవీ విరమణ చేశారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సాంబశివారెడ్డి దంపతులను తహసీల్దార్ షాకీర్ పాషా, విశ్రాంత తహసీల్దార్ గేరా అంకారావు, వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సన్మానం చేశారు.

అర్హులకు పింఛన్లు పంపిణీ

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె పట్టణం, మండలంలోని పెనుమూడి గ్రామంలో వృద్ధులకు శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకట మురళీతో కలిసి ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నెలా 1వ తేదీలోపే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పింఛన్లు అందిస్తూ పేదల జీవితాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, మేకా రామకృష్ణ, అనగాని శివప్రసాద్, దేవగిరి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల సెంటరులో ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు.

వేమూరు: అర్హత గల ప్రతి కుటుంబానికి పింఛన్లు మంజూరు చేయనున్నామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కోడిపర్రు గ్రామాల్లో శుక్రవారం ఆయన అర్హులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పింఛను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, జొన్నలగడ్డ విజయబాబు, తహసీల్దారు సుశీల పాల్గొన్నారు.

భట్టిప్రోలు: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భట్టిప్రోలులో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొత్తగా మంజూరైన వితంతు పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, టీడీపీ మండల అధ్యక్షులు వాకా శేషు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జొన్నలగడ్డ విజయబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాహన యజమానులకు కౌన్సెలింగ్

తెనాలి రూరల్: తెనాలిలో గురువారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీలలో సీజ్ చేసిన వాహన యజమానులకు డీఎస్పీ జనార్ధనరావు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం వద్దకు వాహనదారులను పిలిపించి వారితో మాట్లాడారు. సీజ్ చేసిన వాటిలో సరైన నంబర్ ప్లేట్లు లేని అనేక వాహనాలను గుర్తించామని ఆయన తెలిపారు. పట్టణ పరిధిలో వాహనాల తనిఖీ కొనసాగుతుందని.. యజమానులు సరైన పత్రాలు కలిగి ఉండడంతో పాటు అందరూ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

ప్రజలను మోసగించడంలో చంద్రబాబు ఘనుడు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేపల్లె: అమలు కాని హామీలు ఇచ్చి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసగించారనటంలో ఎటువంటి సందేహం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని.. పెంచనున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి రావడానికి నాడు స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని నమ్మబలికాడన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే 2023-24 ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.9412 కోట్ల భారాలను రాష్ట్ర ప్రజలపై వేశారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో దోపిడీకి కూటమి ప్రభుత్వం తెరపైకి వచ్చిందని మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఎం.శోభారాణి, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు వై.కిశోర్, కేవీ లక్ష్మణరావు, ఎం.వెంకట్రావు, సీతారామయ్య, వి.ధనమ్మ, కె.నాంచారమ్మ, వై.నవీన్, బి.అగస్టిన్, కె.ఆశీర్వాదం, కె.రమేష్, సుబ్బారావు, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



బాపట్ల: జిల్లాలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచవరం రవికుమార్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు గత నాలుగు రోజులుగా వివిధ హాస్టల్స్‌లోని సమస్యలను గుర్తించి నమోదు చేసిన వినతి పత్రాన్ని జిల్లా జేసీ గంగాధర్‌గౌడ్‌కు శుక్రవారం రవికుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్చూరు పట్టణంలో ఎస్టీ హాస్టల్, వేటపాలెం మండలం ఎస్టీ గురుకుల హాస్టల్, బాపట్ల మండలం స్టువర్టుపురం ఎస్టీ గురుకుల బాలుర హాస్టల్లోని సమస్యలను ఆయన వివరించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీ షేక్ పర్వేజ్, పర్చూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కాటి లక్ష్మణ్, రేపల్లె నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు వాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆహారం చేకూరుతోందని సీడీపీవో ఎం.సుచిత్ర పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అలీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాల అవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా తల్లులకు వివరించనున్నట్లు చెప్పారు. బిడ్డ జన్మించిన వెంటనే తల్లి అరగంట సమయంలోపే ముర్రుపాలు బిడ్డకు పట్టించాలని సూచించారు. తద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి మెండుగా ఉంటుందని తెలిపారు. బిడ్డకు పాలు ఇవ్వటంతో తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించే ప్లకార్డుల ప్రదర్శన చేశారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం వేడుకలను చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు హిమబిందు, రాధికా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సహాయకులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్‌గా న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు



బాపట్ల అర్బన్: బాపట్ల టౌన్ హాల్‌లోని న్యూస్ పేపర్ క్లబ్‌లో సభ్యులైన ఐదు గురు నిరుద్యోగ యువకులు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావడం హర్షనీయమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. శుక్రవారం టౌన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు. న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులైన బోయిన వెంకట్రావు, షేక్ రఫీ, షేక్ రబ్బాని, ఆసోది వెంకటరెడ్డి, గోపిలు కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. బోయిన వెంకట్రావు ఉమ్మడి గుంటూరు జిల్లాలనే 13వ స్థానంలో నిలిచి, కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో ఎంపిక కావడం విశేషమని ఆయన తెలిపారు.

విద్యార్థులకు కళ్ల అద్దాలు అందజేత



తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ప్రవాసా భారతీయుడు కొత్తపల్లి కృష్ణ మోహన్ సహకారంతో మారీసుపేట ఎన్‌సీఆర్ ఎస్ ఎంహెచ్ స్కూల్, పెదరావూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం 175 కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున్, పాలడుగు సురేంద్ర, కన్నెగంటి మురళీకృష్ణ, ఆలపాటి కిరణ్‌చౌదరి, వీరవల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

'యువ నిర్మాణ్'లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

రేపల్లె: యువ నిర్మాణ్ ప్రోగ్రామ్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. పట్టణంలోని కళాశాలలో అవనిగడ్డకు చెందిన అంజనాస్ ఫౌండేషన్ వారి యువనిర్మాణ్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువ నిర్మాణ్‌లో నమోదైన విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోపు ఉద్యోగ ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టారులో ఉన్న ఉద్యోగ అవకాశాలు తెలియజేయడంతో పాటు వాటికి కావాల్సిన శిక్షణను అంజనాస్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారన్నారు. ఫౌండేషన్ సీఈవో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్నల్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కల్పించడం, కాంపిటేటివ్ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్ సైతం ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నవీన్, కళాశాల ఏక్యూఏసీ కోఆర్డినేటర్ నరసయ్య, అధ్యాపకులు బి.కోటేశ్వరరావు, మాధవి, ఎం.దాసు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: ఎమ్మార్పీఎస్ నాయకులు పమిడిపాటి కోటయ్య మాదిగ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భిక్ష బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ.. కోటయ్య మాదిగ బడుగు, బలహీన వర్గాలకోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, దూరు వీరయ్య, మల్లవరపు ఆనంద్, శీలం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.